క్లుప్తంగా

మొక్కలు నాటి వినూత్నంగా వీడ్కోలు



మొక్క నాటుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలో చివరి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ వీడ్కోలు కార్యక్రమాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, బీబీఏ, బీకాం, ఫార్మసీ, బీఏ, ఎంఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ తదితర చివరి ఏడాది విద్యార్థులు మామిడి, జామ, అవకాడు, దానిమ్మ, నిమ్మ, రావి, వేప వంటి మొక్కలను విశ్వవిద్యాలయ ఆవరణలో నాటి శాశ్వతమైన జ్ఞాపకంగా మలుచుకున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు తాము చదువుకున్న విద్యాసంస్థతో శాశ్వత సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. దుకాణాల యజమానులు, ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లే సమయాల్లో జూట్ బ్యాగులను తీసుకెళ్లాలన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు కాకుండా జూట్ బ్యాగుల్లోనే సరుకులను అందజేయాలని తెలిపారు. మాంసం కొనుగోళ్లకు టిఫిన్ బాక్సులను తీసుకెళ్లాలని సూచించారు.

రేపు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని బస్టాండ్‌లో మార్చి రెండో తేదీన దివ్యాంగుల బస్సు పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఏటీఎం బస్‌పాస్ నిర్వాహకుడు మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల మేళా మార్చి 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్‌పాస్ కోసం వచ్చే దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తూ పొజిషన్‌లో ఉన్న వారికి ఇళ్ల స్థలాల పట్టాల సర్టిఫికెట్లను మంజూరు చేసి అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తాజోద్దీన్ అన్నారు. పొజిషన్‌లో ఉన్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తాజోద్దీన్ మాట్లాడుతూ ఆరేళ్లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నా నేటికీ పట్టా సర్టిఫికెట్లు రాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల పట్టాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద, పట్టణ నాయకులు ముస్తఫా, సాదిక్‌అలీ, పాండు, హనీఫ్, మోహిన్, యూకుబ్, పూలమ్మ, లక్ష్మి, బిపాష, వహీద్, రహీమాబేగం, శంకరమ్మ, దివ్వాణి, సుప్రియ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆధార్ ఓటీపీ నిబంధన తొలగించండి

నారాయణఖేడ్: ఈ ఏడాది నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ ఓటీపీ నిబంధనను తొలగించాలని ఔత్సాహిక విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎన్‌టీఏ వారి బ్రౌజర్‌లో నమోదు చేసుకునేందుకు ఆధార్ ఓటీపీ నమోదును తప్పనిసరి చేశారని తెలిపారు. ఓటీపీ ఎంటర్ చేస్తేనే దరఖాస్తు ఒపెన్ అవుతుందని, అవగాహన లేని తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్‌ను నిర్దిత సమయంలో అప్డేట్ చేయని కారణంతో ఆధార్ సస్పెండెడ్, క్యాన్సిల్ అని వస్తోందని వాపోయారు. ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేసినా స్టేటస్ అదేవిధంగా ఉంటోందని తెలిపారు. నీట్ పరీక్ష రిజిస్ట్రేషన్‌కు మార్చి 9వ తేదీ చివరి తేదీ కాగా చాలామంది విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉన్నందునా నిబంధనలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

సూర్యాస్తమయం.. అద్భుత దృశ్యం

సూర్యాస్తమయం వేళ.. ఆకాశం ఎర్రని రంగును సంతరించుకుంది. పచ్చని జొన్నపంటపై ఎర్రని వర్ణం మణిహారంగా మారింది. ఈ అద్భుత దృశ్యం కల్హేర్ మండల పరిధిలోని మార్డి శివారులో గురువారం సాయంత్రం ఆవిష్కృతమైన సుందర దృశ్యాలను 'సాక్షి' కెమెరా బంధించింది. – కల్హేర్(నారాయణఖేడ్)



ఎర్రని వర్ణంలో సూర్యుడు



జొన్నపంటపై పరుచుకున్న ఎర్రని మణిహారం

ప్రయాణం.. జర పైలం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ సమీపంలో రోడ్డుపై కొందరు రాత్రి సమయంలో టిప్పర్లలో పెద్దపెద్ద బండరాళ్లను తెచ్చి రోడ్డుపై వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని వెళ్తున్న పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి బండరాళ్లను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
– రామచంద్రాపురం (పటాన్‌చెరు)



రోడ్డుపై వేసిన బండరాళ్లు

వైద్యులు ఉండరు.. వైద్యం అందదు

- రోగులకు నిత్యం 'చింత'లే
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- చింతల్ చెరువు ఆస్పత్రిలో డాక్టర్ల ఇష్టారాజ్యం
- మరుగుదొడ్లలో పల్స్‌పోలియో కిట్లు

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలరే నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడం .. మరోవైపు వైద్యులు నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. దీంతో చేసేదేమీలేక పేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ అప్పుల పాలవుతున్నారు. హత్నూర మండల పరిధిలోని చింతల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 'సాక్షి' గురువారం పరిశీలించగా నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి.
– హత్నూర(సంగారెడ్డి)



చింతల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చింతల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల ఫిబ్రవరికి సంబంధించి ఫీల్డ్ స్టాఫ్ కనీసం ఒక్కరోజు కూడా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడం విధుల పట్ల ఉద్యోగులకు ఎంత అంకితభావం ఉందో స్పష్టంగా అర్థమవుతోంది. ల్యాబ్ టెక్నీషియన్ మూడు రోజుల నుంచి ఆస్పత్రికి రాకపోవడంతో టెస్టులు చేయించుకోకుండా తిరిగి వెళ్లిపోతున్నామని షుగర్ పేషంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నేత్రావతి సైతం ఆస్పత్రిలో అందుబాటులో ఉండటంలేదని, దీంతో సాదులనగర్ సబ్ సెంటర్‌కు సంబంధించిన వైద్యురాలు ఆస్పత్రికి వచ్చి రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని, కంప్యూటర్ డాటా ఆపరేటర్ 12గంటలకు ఆస్పత్రికి రావడం పరిపాటిగా మారిందని పలువురు వాపోతున్నారు.

వంతుల వారీగా విధులు

ఇద్దరు స్టాఫ్ నర్స్ ఉండగా కేవలం ఒకరు మాత్రమే విధుల్లో ఉన్నారు. స్వీపర్లు ఇద్దరు ఉండగా ఒకరే విధుల్లో పనిచేస్తున్నారు. ఇలా ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులంతా వంతులవారీగా పనిచేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్య సేవలందించాల్సిన డాక్టర్లే విధులకు ఎగనాగం పెడితే రోగులను ఎవరు పట్టించుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆపరేషన్ థియేటర్ నిరుపయోగంగా మారింది.



అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయని ఫీల్డ్ స్టాఫ్

మరుగుదొడ్లలో పల్స్‌పోలియో కిట్లు

ఈ నెల మార్చి మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉన్నప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పల్స్ పోలియో మందులను తీసుకెళ్లే ఐస్ డబ్బాలు, కిట్లు మరుగుదొడ్లలో పడేశారు. త్వరలోనే పల్స్‌పోలియో కార్యక్రమం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యసిబ్బందిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మరుగుదొడ్డిలో పడేసిన పల్స్‌పోలియో కిట్లు

చర్యలు తీసుకుంటాం



విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. కంప్యూటర్ ఆపరేటర్‌కు మెమో జారీ చేస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నేత్రావతి సెలవుల్లో ఉంది. ఆరోగ్య కేంద్ర నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. సిబ్బంది సక్రమంగా పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.
– గాయత్రిదేవి, జిల్లా వైద్యాధికారిణి

ఆటో కార్మికులను ఆదుకోండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి అర్బన్: రవాణా రంగం కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. కేరళలో అమలు చేస్తున్న సంక్షేమ బోర్డు విధానాలను పరిశీలించి తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా సీఐటీయూ నాయకులు బాబురావు, రవాణా రంగ యూనియన్ నాయకులు శేఖర్, మాణిక్యం, ప్రవీణ్, ప్రభు, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి సాయిలు

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో...

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రమైన కొండాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట ఉన్నత పాఠశాలలో...

జోగిపేట(అందోల్): జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాలుర) బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందునా శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మినారాయణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో ఝరాసంగం ఫీడర్ సిటీ ఫెయిల్ అయిందని, మరమ్మతుల కోసం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని రంజోల్, పస్తాపూర్, అల్గోల్, దిగ్వాల్, వెంకటాపూర్, సజ్జాపూర్, మాచనూర్, ఝరా సంఘం, ఎల్గోయి, జీర్లపల్లి, చీలపల్లి, రాయికోడ్, కర్చల్, మహబద్పూర్, సింగీతం, న్యాల్కల్, హద్నూర్, డప్పూరు, చాల్కి ,మెటల్ కుంట, మామిడిగి, మీర్జాపూర్, సత్వార్, ధనసిరి, బూచినెల్లి, చిన్న హైదరాబాద్, మల్చల్మ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిరుధాన్యాల సాగుపై శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న మహిళా రైతులు

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుపై శిక్షణ ఇచ్చారు. డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో ఐసీఏఆర్ సహకారంతో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలానికి చెందిన 20 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగుతో పాటు మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్ష, ఎరువుల తయారీ, చిరుధాన్యాలు తినడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై కేవీకే సీనియర్ సైంటిస్టు డాక్టర్ వరప్రసాద్ వివరించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న మహిళా రైతులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ విష్ణుసాగర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధి నిర్వహణ, ఆస్పత్రిల్లో ఓపీల రిజిస్టర్, పంపిణీ చేస్తున్న మందులు, తదితర విషయాలను స్టాఫ్ నర్సును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 18 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 18 మందికి ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రైస్‌మిల్ భూముల వేలం

ముందుకు రాని ఔత్సాహికులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎఫ్‌సీఐకి చెల్లించాల్సిన బియ్యం చెల్లించని రైస్‌మిల్ యజమాని భూములను గురువారం వేలం వేసేందుకు అధికారులు గ్రామానికి వెళ్లినప్పటికీ ఔత్సాహికులు ముందుకు రాలేదు. మండల పరిధి రత్నపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మినర్సింహ రైస్‌మిల్ యజమాని లింబాద్రిరావు ఎఫ్‌సీఐకి రూ.4 కోట్లు బాకీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాకీ చెల్లించాలని పలుమార్లు ఆయనకు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రత్నపూర్, కొత్తపేట గ్రామ పరిధిలో ఆయనకు చెందిన పట్టా భూములను గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించేందుకు సివిల్ సప్లయ్ డీఎం బ్రహ్మారావు, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఉప తహసీల్దార్ షఫియుద్దీన్, ఆర్‌ఐ కిషన్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ధర ఎకరాకు రూ.60లక్షలు నిర్ణయించారు. అందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాట నిలిపేశారు. తిరిగి మార్చి 4న మరోమారు వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం చతుర్ద వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 102 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ భక్తిశ్రద్ధలతో సంగమేశ్వర వేడుకలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సంగమేశ్వర మందిరం తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కళాశాల ఊరేగింపు నిర్వహించి ఆలయంలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

◆ ఘనంగా మహాపడి పూజ

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలో జ్యోతిర్లింగ మహాపడి పూజను శివస్వాములు బుక్క, శ్రీకాంత్, రాజుగౌడ్, ఫణిభూషన్, లక్ష్మణ్‌గుప్తా, నవీన్, శ్రీధర్‌చారి, బొంతపల్లిలోని శివాలయ గురుస్వామి అనిల్, సాయి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పడిపూజకు జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై పూజలు చేశారు. నాయకులు వెంకటేశంగౌడ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రశాంతంగా ఉంటే ఉత్తమ ఫలితాలు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రశాంత వాతావరణం అలవర్చుకుంటే చదువులో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సిర్గాపూర్ ఎస్‌సీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ కిషన్ అన్నారు. సిర్గాపూర్ బాలుర హస్టల్‌లో విద్యార్థులకు మానసిక, ఆరోగ్య అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

◆ బియ్యం పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలోని 25మంది నిరుపేదలకు నాగేశ్వర్‌రావు గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలు నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు గణేష్ పాల్గొన్నారు.

◆ కమనీయం వేంకటేశ్వరుడి కల్యాణం



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ వేంకటేశ్వరస్వామి 22వ బ్రహ్మోత్సవాలోల భాగంగా గురువారం శ్రీవారి కల్యాణాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు నరసింహచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సెక్రటరీ సంగారెడ్డి, సభ్యులు రాజేష్, వీరస్వామి, జీఎస్ నాయుడు, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్‌ఎంసీ ప్లాంటుకు అనుమతి ఇవ్వొద్దు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఎంసీ ప్లాంట్‌ను అడ్డుకోవాలని కోరుతూ తెల్లాపూర్ సొసైటీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి గురువారం తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంసీ ప్లాంట్ నిర్మాణంతో చుట్టుపక్కల కాలనీవాసులు వాయుకాలుష్యంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

◆ ధ్యాన కేంద్రం ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో గురువారం ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కౌన్సిలర్, కాంగ్రెస్ నేత చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ ఆత్మస్థైర్యం కల్పించేందుకే ప్రతిజ్ఞలు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం కల్పించేందుకే ప్రతిజ్ఞలు చేయిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప అన్నారు. కంగ్టి, తడ్కల్ ఎస్సీ హస్టల్ విద్యార్థులకు గురువారం వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రెసిడెన్షియల్ హాస్టల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు కలిచివేస్తున్నాయని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిజ్ఞలు చేయిస్తున్నామని తెలిపారు.

◆ మాధవరెడ్డికి ప్రశంసాపత్రం అందజేత



సంగారెడ్డి అర్బన్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణలో ఉన్న పర్యావరణ సమస్యలపై పాఠశాలల్లో విద్యార్థులచే పర్యావరణ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు నిర్వహించినందుకు సంగారెడ్డి జిల్లాకు చెందిన సమన్వయకర్త మాధవరెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాణిప్రసాద్, హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, టీఎస్పీసీబీ రాష్ట్ర అధికారి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

◆ పోలియో రహిత భారతదేశాన్ని నిర్మిద్దాం

సంగారెడ్డి అర్బన్: పోలియో రహిత భారతదేశాన్ని నిర్మిద్దామని డాక్టర్ శశికర్ అన్నారు. తార ప్రభుత్వ కళాశాలలో పల్స్‌పోలియో నిర్వహణపై ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని ప్రతి కూడలి వద్ద పోలియో చుక్కలు వేయటానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తారా ప్రభుత్వ కళాశాలకు చెందిన 150 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

◆ రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్–దిడ్గి గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కేఏ 38 ఎఫ్ 1111 నంబర్ గల కర్నాటక ఆర్టీసీ బస్సు మోటారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న జహీరాబాద్ పోలీసులు గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.